క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన

నిడదవోలు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. మండలంలోని కాటకోటేశ్వరం, తాడిమళ్ల, కోరుమామిడి జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. కాటకోటేశ్వరంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. ఎంఈఓ కేఎస్‌వీ గణేష్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఉండ్రాజవరం: వేలివెన్ను ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య పుస్తకాలను అందించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటపతి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను శనివారం చేపట్టారు. మెయిన్‌రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు బురద, గోతులమయం ఉండడంతో జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ సహకారంతో సుమారు రూ.లక్ష వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. అర కిలోమీటరు దూరం ఉన్న ఈ రోడ్డును బాగుజేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ గురువెల్లి కుమారి, ఎంపీటీసీ ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు హెడ్‌కానిస్టేబుల్ శనివారం తెలిపారు. సమిశ్రగూడెం లోహియనగర్‌కు చెందిన ద్వారకా రాజ్‌కుమార్(37) ఈనెల 21వ తేదీ రాత్రి గ్రామ రెండు వంతెనల మధ్య నడిచి వెళ్తుండగా ఐచర్ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన అతనిని రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

బీపీ ఆపరేటర్ల వితరణ

నల్లజర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల ఏటా ఏదోక వస్తువు అందజేస్తూ వస్తోంది. అదే క్రమంలో రూ.6వేలు విలువ చేసే రెండు బీపీ ఆపరేటర్లను ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్రహ్మణ్యం శనివారం డాక్టరు గంగాధరరావుకు అందజేశారు. సీహెచ్ఓ పి.ప్రసాదరావు, జీవీపీ ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



తొగుమ్మిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత



సంజీవపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి



సమిశ్రగూడెంలో బంగారుకొండ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- హోమ్ మంత్రి తానేటి వనిత
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల అందజేత

కొవ్వూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో ఇందిరమ్మ కాలనీ, మండలంలో వేములూరు, తోగుమ్మి గ్రామాల్లో నిర్వించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ మేలు చేస్తుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, కౌన్సిలర్లు దేవగుప్తాపు చాందిని, పతివాడ రామారావు, రూరల్‌లో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచులు ఉప్పులూరి విజయ లక్ష్మి, ఆరేపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో కె.సుశీల, తహసీల్దార్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: సంజీవరపురం సచివాలయం వద్ద సర్పంచ్ ఇళ్ల శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: జగన్నాథపురంలో సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్ అధ్యక్షతన జరిగన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 980మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీటీసీ కాకర్ల రాజారావు, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దారు వై.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, తాళ్లపాలెం గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, చిన్నారులకు బంగారుకొండ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, సర్పంచులు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ మాధవీలత
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుతో కలిసి జగనన్న కాలనీ పరిశీలన



తీరుగూడెం లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు త్వరతిగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. పట్టణంలోని తీరుగూడెం జగనన్న కాలనీని శనివారం స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడుతో కలిసి ఆమె పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పట్టణ ప్రాంతంలో ఎకరం రూ.50 లక్షలు చొప్పున విలువైన భూములను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. జగనన్న కాలనీలు పూర్తి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. లేఅవుట్‌కు ప్రధాన రహదారి నిర్మాణం కోసం భూసేకరణ చేసేందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కలెక్టర్ మాధవీలత దృష్టికి తీసుకువచ్చారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు తక్షణమే విద్యుత్ మీటర్లు అమర్చాలని, తాత్కాలింకా మంచి నీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కృషి చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, డీఈ ఎస్. చంద్రశేఖర్, ఏఈలు సీహెచ్ రామ్‌గిరిష్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- కొత్తపల్లి అగ్రహారంలో 'గడప గడపకూ'



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెరవలి: గ్రామాల అభివృద్ధికి అడ్డొస్తే ఏ పార్టీ వారైనా సహించేది లేదని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు హెచ్చరించారు. పెరవలి కొత్తపల్లి అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయాల నిధులు ఇస్తోందన్నారు. అభివృద్ధికి ప్రతిపక్ష పార్టీలు అడ్డొస్తే సహించేది లేదని తెలిపారు. ఈ గ్రామంలో సుమారు 2 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేపట్టామని, అలాగే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సుమారు నాలుగు కోట్లు మేర లబ్ధి చేకూరిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేసి, వారు పొందిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, ఎంపీపీ కార్బెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నక్కా పాలేశ్వరరావు, కోర్ల ఉదయ భాస్కరరావు, మలకా సాయి, పిల్లా శ్రీనివాస్, లొల్ల కనకయ్య, కేతా సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల సహాయంతో విద్యార్థులకు బస్‌పాస్‌లు

పెరవలి: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సాయంతో విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించినట్టు పెరవలి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ తెలిపారు. పెరవలి మండలం కానూరు ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు శనివారం ఉచిత బస్‌పాస్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రెసిడెంట్ కోలా సీతా రాముడు, దాతలు తోట సురేష్, కొమ్మిశెట్టి చిన్ని, అంబటి బ్రహ్మయ్య, బూరుగుపల్లి రాజు, సలాది ఉదయ భాస్కరరావు, ఆర్టీసి సిబ్బంది షేక్‌లాల్, ప్రధానోపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

ఉండ్రాజవరం: నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు శనివారం యూనిఫాం పంపిణీ చేశారు. కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్న బూరుగుపల్లి పద్మాజారాణి ఆర్థిక సహకారంతో ఎంపీసీ, సీఈసీ గ్రూపుల విద్యార్థులకు అందజేశారుజ. ఈ మేరకు పద్మాజారాణిని పాఠశాల హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్, అధ్యాపకులు అభినందించార

ఈ-పంట నమోదుపై అవగాహన

గోపాలపురం: ఈ-పంట నమోదు ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన పట్టికలో నమోదు చేయాలని గోపాలపురం ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.కృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ, ఏఓ రాజారావు మాట్లాడుతూ రైతులందరూ ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు వల్ల పంటలకు నష్టం జరిగినప్పుడు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో లబ్ధి పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పంట నమోదు వల్ల రైతులు ఏఏ పంటలు ఎంతెంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, వాటికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచడానికి వీలుంటుందని వివరించారు.

పరిషత్ నిధులతో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు , మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దేవరపల్లి: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి చేపట్టినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శనివారం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండేళ్లలో రూ.10 కోట్లు గ్రామాల అభివృద్ధికి కేటాయించినట్టు ఆయన తెలిపారు. అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు 47 గ్రామ సచివాలయాలను సందర్శించి సుమారు 34 వేల వినతులను పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్రు స్వర్ణలత, వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ ఆచంట అనసూయ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శ

చాగల్లు: బీజేపీ మండల అధ్యక్షుడు కరుటూరి కృష్ణప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జెడ్పీటీసీ గారపాటి విజయదుర్గ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పరిమి రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, నాయకులు కృష్ణప్రసాద్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కొవ్వూరు: దళితులపై దాడి చేసిన కౌలుదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మకు గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన పట్టాదారులు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకట్రావు, సీపీఐ నాయకులు కోడవయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై అధికారులకు నోటీసులు

ఉండ్రాజవరం: గ్రామ పంచాయతీలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ సాధారణ నిధులు అధికారులు దుర్వినియోగం చేశారని గ్రామ ఉప సర్పంచ్ సింహాద్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురు అధికారులకు పంచాయతీరాజ్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఉండ్రాజవరం గ్రామ పంచాయతీ ప్రత్యేక పాలనలో 2019-20, 2020-21 మధ్యకాలంలో అప్పటి గ్రామ ప్రత్యేకాధికారులుగా పని చేసిన పి.వి.నర్సింహమూర్తి, ఎం.వీరాస్వామి నాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.సుదీప్తిలపై ఉప సర్పంచ్ సింహాద్రి రామకృష్ణ ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు అందాయి.

మణిపూర్ హింసను నిరసిస్తూ ధర్నా

కొవ్వూరు: మణిపూర్ చోటు చేసుకున్న అమానుష మానవ హింసను అరికట్టాలని పౌర హక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులను కేంద్ర ప్రభుత్వం నియంత్రించాలంటూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు నక్కా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని చర్చిపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలోమండల ఆశ కార్యకర్తల గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు.

యువకుడి మృతి

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరంలోని మోరంపూడి జంక్షన్‌కు చెందిన ఉండవల్లి ఫణీంద్ర(20) మృతి చెందాడు. ఏలూరు వైపు వెళుతున్న లారీ రాంగ్ డైరెక్షన్‌లో మోటారు సైకిల్‌పై వస్తున్న ఫణీంద్రను ఢీకొని వెళ్లిపోయింది. ఫణీంద్ర అక్కడకక్కడే మృతి చెందినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు శనివారం రాత్రి తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.